# ఛీ! ఎదవ బతుకు!

"అమ్మా...ఓ అమ్మా ... ఓ అమ్మో...ఆకలవుతాంది. పలకవేంటే ?"

పోలాయి గొంతు చించుకుని అరుస్తూన్నా రంగి ఆ పిలిచేది తనని కాదన్నట్లు పలకలేదు. కొడుక్కి అన్నం పెట్టే బాధ్యత తనది కాదన్నట్లు కుండలు కడుక్కుంటూంది. ప్రతిరోజూ ఆకలి అనకుండానే అన్నమో, గంజో పెట్టేతల్లి ఈ రోజు ఆకలి అన్నా కిమ్మనకుండా వూరుకుండే సరికి పోలాయికి విసుగొచ్చి ముందున్న జర్మన్‌సిల్వర్ పళ్ళెం విసురుగా తన్నాడు. చట్టిలమీద మూతలు తీసి చూశాడు. అన్నీ ఖాళీవే.

ఇదా సంగతి? ఇలాంటి స్థితి అప్పుడప్పుడూ తప్పదు వాళ్ళకి. ఓ విధంగా గంజనీళ్ళు కూడా లేకుండా రెండేసి రోజులు గడపటం అలవాటే అయినా ఈవేళ ఆకలి పేగులు తోడేస్తూంది. కాళ్ళు కడుపులో పెట్టుకుని కూర్చోనీయటం లేదు. తను అడిగినదానికి వుందో, లేదో అనైనా జవాబు చెప్పని తల్లిమీద చచ్చేంత కోపంవచ్చి దగ్గరేవున్న ఉప్పు పిడత విసిరికొట్టాడు. అది కిందపడి ముక్కలు ముక్కలైంది.

దానిలో అడుగునవున్న నాలుగు ఉప్పురాళ్ళు ఇల్లంతా చెదిరి పడ్డాయి.

"చచ్చినోడా! ఇప్పటిదశకా తిరిగొచ్చి ఆకలంటే బూరులూ వులగం ఎట్టేందుకు జమీందారింటో పుట్టావా యేంటి? దొరబాబులా గొచ్చావు. ముప్పైపైసల ఉప్పు చట్టి నేలగొట్టావా ... రానీ నీ బాబుకి సెప్తా!" రంగి దేక్కుంటూ వచ్చి నేలమీదపడ్డ ఉప్పు పోగుచేసి ఓ కాగితంలో కెత్తుకుంటూ కొడుకుని ఇంకా తిడుతూనే వుంది.

"ఎదవబతుకు! ఈ ఇంటో పుట్టేకంటే సస్తేమేలు— కడుపుకింత గంజన్నా కరువేగందా!" విసురుగా గుడిసెలో నించి బయటికి వచ్చేశాడు పదేళ్ళ పోలాయి. వాడి కడుపు ఎప్పుడుచూసినా వెన్నుకి అంటుకునే వుంటుంది. తలకి నూనె లేక తాటిపీచులా వుంటుంది. వాడి వళ్ళంతా తాటిమట్టలా గరగరమంటువుంది. వాడి కళ్ళలో ఆకలిమాత్రం ప్రపంచాన్నంతటినీ చుట్టగాచుట్టి అప్పడంలా నమిలి మింగేయాలనిపిస్తూన్నట్టుంటుంది.

వీడు పుట్టకముందు రంగి సంసార పరిస్థితి కాస్త బాగానే వుండేది. పోలిగాడి తండ్రి వీరన్న కూలిపనికెడితే రంగి ఇంటిపని చక్కబెట్టుకుని కలవారి ఇళ్ళలో పాచిపనులు చేసి మొగుడి సంపాదనకి కాస్త చన్నీళ్ళకి వేణ్ణీళ్ళు అన్నట్లు సాయపడేది. పోలిగాడు పుట్టిన రెండేళ్ళకి మరో కాన్పులో వాతంవచ్చి రెండుకాళ్ళూ పట్టుకుపోయాయి. ఎన్ని ఇంగ్లీషు మందులు వాడినా ప్రయోజనం లేకపోగా, వందరూపాయల అప్పు మిగిలింది. రంగి ఇప్పుడు దేకుతూంది కానీ, నడవ లేదు.

ఒక్కగాను ఒక్కబిడ్డ పోలిగాడంటే తల్లితండ్రులకి కాస్త గారాబం. తల్లిమీద కోపంవచ్చి బయటికి వచ్చిన పోలిగాడు ఆకలి మరిచిపోవటానికి అలా ఇలా తిరుగుతూన్నాడు. ఓ సినిమా బండి కనిపిస్తే దానివెంట కాస్సేపు పరుగెత్తాడు. నాలుగు కాయితాలు అందుకుని వాటిలోని బొమ్మలని పదినిమిషాలు చూశాడు. విసుగెత్తి ఆ కాయితాలు విసిరికొట్టాడు. కాస్సేపు ఆ దారినిపోయే చిన్న కార్లనీ, లారీలనీ, రిక్షాలనీ చూసి చూసి మెడ నొప్పిపెడుతూంటే చేత్తో నొక్కుకుంటూ వుండగా ఏదో పెద్ద వూరేవుగిం సాగివస్తూంటే ఆసక్తిగా దాన్ని చూసి అందులో నడిచే అందరూ "జై ఇందిరా గాంధీకీ" అంటే తనూ అన్నాడు.

అదీ వెళ్ళిపోయింది. నడిచి నడిచి ఓ పసుపుపచ్చ బంగళా దగ్గరికొచ్చాడు. చాలా పెద్ద బంగళాయేనే, దీంట్లో ఎన్ని గదులుంటాయో? దీంట్లో వాళ్లెలాంటి తిండి తింటారో, ఎక్కడ పడుకుంటారో చూడాలనే కోరిక వుంది. కానీ, ఎలా సాధ్యం? ఆ బంగళాకి కార్లు లోపలికి బయటికీ రావటానికి తెరిచే పెద్ద ఇనప గేటుగాక మరో చిన్న గేటువుంది. రకరకాల పువ్వుల మొక్కలున్నాయి. కిటికీలకీ, దర్వాజాలకీ ముదురు నీలంపువ్వుల తెరలు గాలికి ఇటూ అటూ వూగుతున్నాయి. వరండాలో రకరకాల కుర్చీలున్నాయి. కొన్ని పూవుల తొట్టెలు గమ్మత్తుగా వరండాలో దూలాలకి వేలాడుతూంటే విచిత్రంగా చూస్తూ నిలుచున్నాడు.

చిన్న గేటుదగ్గర నిలుచుని కాళ్ళు ఎత్తి కనిపించినంత వరకూ చుట్టూ చూస్తూ, తన చెయ్యిచాస్తే అందేంత

దగ్గరగా ఓ ఎఱ్ఱ ముద్దమందార పువ్వు కనిపించి చెయ్యిచాచి అందుకోబోయాడు.

అంతవరకూ ఎక్కడ వున్నదో గుఱ్ఱంలా తెగ బలిసిన కుక్క "భౌ భౌ"మంటూ మీదికొచ్చింది. ఇనపగేటు తీసి వుంటే పోలిగాడి కండలు వూడబెరికి రక్తం తాగేలావుంది దాని వాలకంచూస్తే.

ఆ కుక్కని చూస్తూనే హడిలిపోయి దూరంగా పారి పోయాడు. "జిన్నీ కమాన్" అంటూంది వరండాలో నిలు చున్న ఓ పదేళ్ళ అమ్మాయి.

ఆ పిలుపుకి కుక్క తోక ఆడిస్తూ వెళ్ళిపోయింది. పోలిగాడి కిది చిత్రాతి చిత్రంగా కనిపించింది. మెల్లగా మళ్ళీ గేటు దగ్గరికొచ్చాడు,

అప్పటికే ఆ పిల్ల లోపలికి వెళ్ళబోతూంది. లేత పచ్చరంగు గౌనూ, ఎఱ్ఱ స్వెట్టరూ వేసుకుందా పిల్ల. పోనీ-టెయిల్ కట్టుకుని చకచకా నడుస్తూంది. ఆ పిల్లముఖం సరిగా కనపడలేదు. ఆ ముఖం చూడాలనే కోరిక పోలిగాడిని నిలవ నీయటం లేదు. ఎలా ఆ పిల్ల ముఖం చూడటం ? తెగ ఆలో చించేసి మెరుపులాంటి ఆలోచన రాగానే ఉత్సాహంగా ఓ రాయి తీసుకుని గురిచూసి కుక్కకేసి కొట్టాడు.

కుక్క "భౌ భౌ"మంటూ తిరిగింది. ఆ అమ్మాయి కూడా కోపంగా వెనక్కి తిరిగింది. ఈసారి పోలిగాడు భయ పడి పారిపోలేదు. గేటు మూసివుందిగా అనే ధైర్యంతో నిలబడ్డాడు. కుక్క అరుస్తూ గేటు దగ్గరికి పరుగెత్తుకొచ్చింది. దానివెంట ఆ పిల్లకూడా వస్తూ కళ్ళజోడు తీసి మళ్ళీ పెట్టు

కుని పోలాయివైపు మింగేసేలా చూస్తూ, "ఏయ్! ఎవరు నువ్వు? ఎందుకొచ్చావ్" అంది.

నల్లగా చింతపండు రంగులో వుందాపిల్ల. పైగా మెల్ల కన్ను. అది కనపడకుండా వుండాలని కాబోలు కళ్ళద్దాలు ఈ రెండూ తప్పిస్తే పిల్ల బాగానే వుందనిపిస్తూంది.

"ఇక్కడెందుకు నిలుచున్నావంటే మాట్లాడవేం?" మరీ గట్టిగా అడిగింది.

'ఇంత అందమైన మేడ, ఇమానమంత కారు, గుఱ్ఱంలా తెగబలిసిన కుక్క, తినటానికి బోలెడంత అన్నం-ఇన్నీ వున్నా ఈ పిల్ల నల్లగావుందేంటీ, ఆ మెల్లకన్నేంటీ' అని ఆలోచిస్తూన్నాడు. భాగ్యవంతులందరూ అందంగా వుండి తీరతారనీ, వాళ్ళకి మంచి మనస్సులు వుండి వుంటాయనీ పోలిగాడి నమ్మకం. ఈ పిల్ల మెల్లకన్ను చూసేసరికి పోలిగాడికి నీరసం వచ్చింది. జవాబు చెప్పందే వదిలేలా లేదాపిల్ల.

"ఊఁ నిన్ను సూడటానికే" అని అనబోయి వెక్కి తీసుకుని, "మీ...మీ...కుక్కని సూట్టానికి" అని తడబడుతూనే అన్నాడు.

ఆ పిల్ల ముఖంలో చిరునవ్వు చిందింది. "ఇది...దీని పేరు జిన్. బలే మంచిది. నేనంటే దీనికి చాలాయిష్టం. బలే కుక్కపిల్ల కదూ?"

నవ్వుతూనే అడిగింది. పోలిగాడి ఒళ్ళంతా కితకితలు పెట్టినట్లయి పోయింది. 'ఈ పిల్లకంటే నవ్వు శానా బాగుండాది' అనుకున్నాడు మనస్సులో. 'అయినా ఈ బాగెమంతు

లంతా పుణ్యం చేసుకున్నవాళ్ళు. అందుకే బంగళాల్లో నివసిస్తూ, కోరినది తింటూ హాయిగా వున్నారు.'

పోలిగాడికి కీ సంగతులన్నీ తలి చెప్పింది. అవే వాడి మనస్సులో బాగా ధ్రువపడిపోయాయి. తన ఇంటి చుట్టు పట్లవున్న కూలిజనం శాంతాఖానీ కొట్టేప్పుడిలాంటి మాటలెన్నో విన్నాడు.

ఎంత మెల్లకన్ను పిల్ల అయినా ఈ పిల్లనిచూస్తే ఎందుకో చాలా సరదా వేస్తూంది పోలిగాడికి. కబుర్లు చెప్పాలనీ, స్నేహితంగా వుండాలనీ అనిపిస్తూంది. ఆ పిల్ల ఒప్పుకో వద్దూ ?

"ఏమిటీ చూస్తున్నావు ? కుక్కనంటూ నన్ను చూస్తూన్నా వెందుకూ ?

జవాబేం చెప్పాలో తెలియక తల గోక్కున్నాడు, గేటుకివున్న ఇనప పూచలని పట్టుకుని.

"పో, వెళ్ళిపో ! నీలాంటాళ్ళతో నే మాట్లాడితే మా అమ్మకి కోపం వస్తుంది. నీ భరతం పడుతుంది. అదిగో వస్తోంది వెళ్ళు."

"నిమ్మీ ... ఏం చేస్తున్నావే ... రా అమ్మా ... అలాంటి వాళ్ళతో మాట్లాడకూడదని చెప్పలే ? దొంగ వెధవలా వున్నాడు—పొమ్మను. నువ్వు లోపలికి రా." ఓ స్థూలకాయురాలైన ముప్ఫైయేళ్ళ స్త్రీ పోలిగాడివైపు కొరకొర చూస్తూ కూతుర్ని రమ్మని చెప్పి లోపలికి వెళ్ళింది.

నిమ్మీ తల్లి పిలుపుకి లోపలికి పరుగెత్తింది. కుక్క మాత్రం గుర్రుమంటూ పోలాయివైపు చూసి వెళ్ళి

పోయింది. 'ఈ పిల్ల పేరేంటీ-నిమ్మీ నా ... అంటే నిమ్మ కాయా...ఏందో.... ఈళ్ళు గొప్పోళ్ళు.'

చింపిరి తల గోక్కుంటూ అర్ధగంట నిలుచున్నా నిమ్మీ బయటికి రాలేదు. పోలాయికి కాళ్ళు లాగటం మొద లెట్టాయి.

మళ్ళీ కడుపులో ఆకలి విజృంభించింది. కాళ్ళీడ్చు కుంటూ ఇల్లు చేరాడు. తను చూసిందంతా తల్లితో చెప్పి ముంతెడుగంజి తాగేసి పడుకున్నాడు. ఎంతసేపటికీ నిద్ర రావటంలేదు.

చాలా రాత్రి గడిచిన తర్వాత నిద్రపట్టిందే కానీ, ఆ నిద్రలో చిత్ర విచిత్రమైన కలలు వచ్చాయి.

ఆ మేడలో మెల్లకన్ను పిల్లతోబాటు మంచి బట్ట లేసుకుని పూవులతోటలో ఆడుకుంటున్నట్లు, తను బంతి విసు రుగావేస్తే ఆ గుర్రంలాంటి కుక్క పరుగెత్తివెళ్ళి బంతి నోటితో కరిచిపట్టుకుని తన కిచ్చినట్లు, అంతలో ఆ లావుపాటి ఆవిడ పళ్ళెంలో రకరకాల తీపి పిండివంటలు తెచ్చి ఇద్దరికీ పెట్టినట్లు, అవి తిన్నన్ని తిని ఇంక అక్కరలేదని విసిరి కుక్కకి పారేస్తూ పగలబడి నవ్వుతున్నట్లు—ఏమిటేమిటోగా వచ్చింది కల.

చిరుగుల బొంత కాళ్ళవరకూ చాలక చల్లటి గాలి విసు రుకి చలేసి కాళ్ళు ముడుచుకుంటూ వుంటే కమ్మటి కల చెదిరి పోయి మెలకువ వచ్చేసింది. ఇంక నిద్ర రాలేదు. ఆ కల మళ్ళీ ఎంత బాగుండునూ అనిపిస్తూంది. అయినా మళ్ళీ ఆ కల రానేలేదు పోలిగాడికి.

* * *

ప్రతిరోజూ పసుపురంగు మేడ దగ్గరికి వెళ్ళటం అలవాటయింది పోలిగాడికి. సాయంకాలం నిమ్మా గేటు తీసుకుని కుక్కని వెంటబెట్టుకుని షికారొస్తుంది. దాని మెడలో గొలుసు సుతారంగా పట్టుకుని తన కిష్టమైతే పోలిగాడితో కబుర్లు చెప్తుంది. లేకుంటే అసలు వాడిని ఎరగనట్లు ముఖం తిప్పేస్తుంది.

"బుల్లెమ్మా" అంటూ తనే పలకరిస్తాడు.

"ఏయ్, ఏమిటా పిలవటం...బుల్లెమ్మా... లిల్లిమ్మా అంటూ ? ఫో !"

చీదరించేస్తుంది నిమ్మా. ఆ పిల్ల అలా అన్న రోజు దుఃఖం కట్టలు తెంచుకుంటుంది పోలిగాడికి. నిమ్మా కుక్కతో బంతి వేస్తూ సరదాగా ఆటలాడుతూంటే, 'ఛీ. ఎదవ జలమ ఆ కుక్కనైై పుట్టానుగాదు' అనుకుంటాడు తనలో తను. కుక్కవంక కోపంగా చూస్తాడు. అది మరీ గుర్రుమంటూ చూస్తూంది.

"నీతో మాట్లాడను... ఫో అవతలికి!" అంది నిర్మల స్వెట్టర్ని సర్దుకుంటూ. పోనీలే అని పౌరుషం వచ్చి ఇంటి కొచ్చేసినా మరుసటి రోజు వెళ్ళకుండా మానలేడు పోలాయి.

ఆదివారం నిమ్మా గేటు ముందున్న పచ్చగడ్డిమీద కుక్కతో ఆడుతూ ఒక్కో చాకెలెట్టూ దూరంగా విసిరేస్తూంటే, కుక్కపిల్ల పరుగున వెళ్ళి తినేసి మరోటి వెయ్యి అన్నట్లు చూస్తూంది తన చిన్న యజమాని వైపు.

ఆ రంగుకాయితంలోది తింటే ఎలా వుంటుందో పోలి గాడి ఊహ కందటం లేదు. అలా చూసి చూసి ఇంటి కొచ్చేశాడు.

తండ్రి గుడిసె బయట కుక్కి మంచంలో కూర్చుని బీడీ వెలిగించు కుంటూన్నప్పుడు తన సందేహం బయట పెట్టాడు. వీరన్న కొడుకు అడిగేది ఏమిటో మొదట అర్థం కాకున్నా తరవాత అర్థంచేసుకుని, "ఓరి ... అదంటరా ? ఆ రంగుకాయితాల్లో చుట్టుండేదాన్ని చాకొలెట్లు అంటార్రా. తియ్యగా ఉంటాయంట. నే నెప్పుడూ తినలేదు గానీ, మన కెందుకురా బాగెమంతుల యవ్వారాలూ. అలాంటి వాటి జోలికి పోమాకు ...పడుకో" అని కళ్ళు మూసుకు న్నాడు వీరన్న.

అక్కడే గోనెపట్టా పరుచుకుని పడుకున్న రంగి— "మామా, నీ వా చాకలట్లు తిన్నావేంటీ— తియ్యగుంటదో, కారంగుంటదో చెప్తన్నావు!" అంది.

"ఆఁ ఆఁ పెళ్ళప్పుడు మీ అయ్యెట్టిండుగా. మరి రుసి తెల్వదేంటి ?"

వీరన్న అలా అనేసరికి రంగికి చిర్రెత్తుకొచ్చింది.

"నీ వేనాడు సూటిగా మాటాడావు గనుక! ఎప్పుడూ గింతే - నా జలమకింతే." మూతి మూడు వంకర్లు తిప్పింది రంగి.

"అద్సరేగానీ, రంగీ, మనోడిని సదివిద్దారె. ఈడి అదురుట్టం మంచిదనీ-ఆనాడు సిలక జోసెం సెప్పినాడుగందా?

అందుకే బళ్లో కంపిద్దాం. ఏరా, పోలిగా రేపు సిలేటూ, బలపంకోపీ తెత్తాగానీ బళ్లోకి పోతావా ?"

"ఓ..." చాటంత ముఖం చేసుకున్నాడు పోలిగాడు. "ఆఁ మన ఇంటా వంటా లేదీ సతుకు. సతికి మన క్కూడెడతాడా ? ఏం వద్దు. నీతో కూలిపనికి లాక్కెల్లు. ఆ సతుకులన్నీ గొప్పోళ్ళకి గానీ, మనకెందుకు?"

"నీ అపశకునం తగులడ. ఒక్కగా నొక్క బిడ్డ. గింత కడుపునిండా కూడు దొరికే పని సూసియ్యాలనే బుద్దేలేదేమే ! నీకూ, నాకూ లాగా ఈడు ఎంగిలి మెతుకులూ, గంజినీళ్లూ తాక్కూడిడదు. ఇదిగో, చెప్తన్నా ఇనుకో — ఈ జబ్బలో శకితి బగమంతు డిచ్చినంతదంకా సంపాదిత్తానే. నా కొడుక్కి సతువు సెప్పిత్తానే. ఏయ్... తెలుసా? నా పోలిగాడు సూటూ బూటూ ఏసుకుని పంతులుద్దోగం సేత్తాడే."

కొడుకు భవిష్యత్తులోకి తొంగిచూస్తూ తను ఇంకా కష్టపడి నాలుగు రాళ్ళు వెనకేసి చదివించాలని ఆలోచనల పైన ఆలోచనలు చేస్తూన్నాడు వీరన్న.

"నాయనా! ఈ సిరిగు లాగు ఏసుకుని బళ్లోకెడితేనవ్వుతారే!" తండ్రి మెడ వాటేసుకొని గారాబం పోతూన్నాడు.

"రేపేలాగూ చొక్కా, పలకా బలపం అన్నీ కొత్తవి తెత్తాలేరా. నీ కెందుకూ, నే నున్నాగా? పడుకో" అంటూ తనూ నిద్రలోకి జారిపోయాడు.

"ఆఁ ఈ మొగమే! అన్నీ కొత్తవి తెచ్చేత్తాడంట. మింగేందుకు మెతుకు లేదు. మీసానికి సాంపెంగ నూనెంట.

అట్లాగుండి బతుకు. ఇయాల గంజిగ్గతి లేదు. రేపు ఎక్కడ కన్నం వేసి తెత్తావు..."

రంగి గొణుక్కుంటూనే వత్తిగిలి పడుకుంది. పోలా యకి నిద్ర రావటంలేదు. కుక్క మంచంలో తండ్రి పక్క ఇరుగ్గా పడుకుని ఆకాశంలోకి చూస్తూన్నాడు. చంద మామలోని పేదరాశి పెద్దమ్మ నూలు వడుకుతూన్నట్లు కని పిస్తూంది వాడి కళ్ళకి. నక్షత్రాలన్నీ నిమ్మా చేతిలోని ఉలిపిరికాయితంలోని చాక్లెట్ల మాదిరిగా మెరుస్తూన్నాయి. "పేదరాశి పెద్దమ్మా! నాకో చాకొలెట్టు ఇవ్వవా" అంటూ కలవరిస్తూన్నాడు మగత నిద్రలోకి జారిపోయి.

* * *

తెల్లవారింది. మామూలుగా ఆటలకి పోతూన్న కొడుకుని "ఎక్కడికీ పోమాకరా. మీ అయ్య జల్దీ వస్తా న్నాడూ" అంది రంగి.

"అంతలోకే వత్తాన్లేవే" అంటూ పచ్చ మేడ దగ్గరికి పరుగుతీశాడు.

నిమ్మా చేతిలో చాకొలెట్లు విసిరేస్తూంటే కుక్క పరుగున వెళ్ళి తినేస్తూంది. ఈ ఆట అంటే నిమ్మాకి తగని ఇష్టం.

హుషారుగా చప్పట్లు కొడుతూ నవ్వుతూంది నిమ్మా. ఇదంతా చూస్తూన్న పోలిగాడి నోట్లో నీరూరుతూంది. పెదిమలు తడుపుకుంటూ ఆశగా చూస్తూన్నాడు. నిమ్మా వేసే ప్రతి చాకొలెట్టూ తనే పరుగున వెళ్ళి అందుకుని పర పరా తినేస్తున్నట్లుగా భావించుకుంటూన్నా, తృప్తి కల గటం లేదు ఈ వేళ. ఒక్కటి ఎలాగైనా సరే తినాలనే

కోరిక వాడిని నిలవనీయటం లేదు. ఆ కోరిక పెరిగి పెరిగి పెద్దదై పోతూంది. ఒకపక్క తన బ్రతుకు ఆ కుక్కకంటే హీనంగా ఉన్నందుకు ఉక్రోషం వచ్చేస్తూంది. 'చీ ఎదవ బతుకు... కుక్కగా పుట్టినా బాగుండి పోను!' నిట్టూర్చాడు.

నిమ్మా చేతిలో ఉన్న చాకొలెట్ల డబ్బా ఖాళీ అయి అయిపోతూంది. మహా ఉంటే రెండో మూడో మిగిలాయేమో? పోలిగాడి మనస్సులో తొందరెక్కువై పోయింది.

"బుల్లెమ్మా, నాకో ఇట్టవా?" నోరు తెరచి అడగలేక అడిగాడు.

"అబ్బా, ఆశే..." మూతి తిప్పింది నిమ్మా.

"ఒక్కటంటే ఒక్కటి శాన." అది తినాలనే అభిలాషని వదులుకోలేక, అభిమానాన్ని చంపుకుని అన్నాడు.

"మనుషులకంటే కుక్కకే విశ్వాసం ఎక్కువట. మీరంతా దొంగవెధవలు. అందుకే పెట్టకూడదు. మా అమ్మ చెప్పింది."

పోలిగాడి ముఖం నయాపైసంత అయింది. 'మీరంతా దొంగవెధవలు' అన్న మాటకి వాడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'నే నేం దొంగాడిని కాను. అట్టా అయుంటే నీ చేతులో డబ్బా ఒక్క దెబ్బన లాక్కు పారిపోయుండే వోడిని. కానీ, మా అమ్మా, నాన్నా ఊరుకోరు. దొంగబతుక్కంటే సావటం మేలంటది మా అమ్మ... పోనీలే. నాకేం వద్దు... ఎంచక్కా మా అమ్మ ముంతెడు గంజి పోసి ఉల్లిపాయి కొరుక్కోటానికి కెడతంది. అదే బాగుంటదీ చాకొలెట్లు కంటే. పో.... నీ దోస్తీ కటాఫు.'

చరచరా నాలుగడుగులు వేశాడు ఇంటికి వెళ్ళిపోవటానికి.

అలా వెళ్ళిపోయే పోలిగాడిని చూస్తూంటే బలే గర్వంగా ఉంది నిమ్మీకి. ఇంకా, ఇంకా ఏడిపించి వినోదించాలనిపించి, "ఒరే, పోలిగా! ఇంద, చాకొలెట్టుఇస్తా రా" అని బిగ్గరగా కేక పెట్టింది.

పోలిగాడు వెనక్కి తిరిగాడే గానీ, నిమ్మీ నిజంగా అది ఇస్తుందని నమ్మకం లేదు. నిర్లక్ష్యంగా చూశాడు.

"నిజంగా ఇస్తాను, రా"

వాడి కళ్ళు తళతళ లాడుతూండగా ఒక్క పరుగున వచ్చేశాడు. చెయ్యి చాచాడు.

"ఆఁ...ఆశే. ఇలా క్కాదు. నేనో పందెం వేస్తాను- నీకూ, మా జిన్నీకీ. ఇద్దరిలో ఎవరు గెలిస్తే వాళ్ళకి ఈ చాకొలెట్టు."

పోలిగాడికి గెలవలేనేమో అని మొదట బాధ వేసినా తరువాత ధైర్యం తెచ్చుకున్నాడు. ఈ కుక్కే కాదు, ఈ ప్రపంచం అంతా ఏకమై వచ్చినా అందర్నీ ఓడించి పారేసి ఆ చాకొలెట్లని పరపరా నమిలి మింగేస్తాను- అన్నట్లు చూస్తూ, 'అట్లాగే' అన్నట్లు తల ఊపాడు.

నిమ్మీ జిన్నీకి అర్థమయేలా చెప్పి "వన్, టూ, త్రీ" అంటూ రెండు సార్లు చెయ్యి విసిరింది. పోలిగాడూ, జిన్నీ పరుగు తీశారు.

నిమ్మీ పగలబడి నవ్వుతూ "నేనసలు వెయ్యందే" అంది.

"ఇదిగో, పోలిగా, జిన్నీ ... ఈ సారి తప్పకుండా వేస్తా. రెడీగా ఉండండి."

పోలాయి ఓ కాలు ముందుకు పెట్టి పరుగు తీసేందుకు సిద్ధంగా నిలుచున్నాడు. జిన్నీ తోక ఆడించి తన యజమానురాలిని కుతూహలంగా చూసింది. "పోలిగా, ఆ చాకొలెట్టు తీసుకు నా దగ్గరికి పరుగున రావాలి. వన్...టూ...త్రీ. తిరిగి నా దగ్గరికి రావాలి." మరోసారి గుర్తు చేసింది. పోలాయి బాణంలా దూసుకెళ్ళాడు. కుక్క అంతకంటే వేగంగా పరుగు తీసింది. కానీ, చాకొలెట్ పోలిగాడికే చిక్కింది. జిన్నీకి కోపం ముంచుకొచ్చి పోలిగాడిమీద పడబోతే, భయపడిపోయి రోడ్డుకి అడ్డ దిడ్డంగా పరుగుతీస్తూ నిమ్మీ వైపు వస్తూండగా స్పీడుగా వచ్చిన ఓ చిన్న కారు పోలిగాడి మీదనించి సర్రున దూసుకుని పది గజాల ముందుకెళ్ళి ఆగిపోయింది. నిర్మల తండ్రి వెంకట్రావు ఖంగారుగా కారు దిగాడు. జిన్నీ తోక ఆడిస్తూ యజమాని దగ్గరికి పరుగెత్తుకొచ్చింది.

కారులో వెంకట్రావు స్నేహితుడు మాధవరావు కిందికి దిగుతూ, "వెంకట్రావ్, ఎంతపని చేశావోయ్! నీ పెంపుడు కుక్కని రక్షించటం కోసం కుర్రాడిని...కుర్రాడిని ..బలిపెట్టావా!" అని ఇంకేం చెప్పటానికి నోరు రాక వెనక్కి వచ్చి చూసేసరికి, పోలిగాడు కొన ఊపిరితో రక్తం మడుగులో కొట్టుకుని మరుక్షణంలో ప్రాణం వదిలేశాడు. ప్రాణం పోయినా, కుడిచేతి పిడికిలిలో చాకొలెట్టు సురక్షితంగా బిగుసుకునే ఉంది.

నిమ్మీ "కీ" మంటూ వెర్రికేక పెట్టి కొయ్యలా బిగుసుకు పోయింది. వెంకట్రావు ఏం చేయాలా అని ఆలోచిస్తూ నిలుచున్నాడు.

నిప్పులాంటి మనిషి మాధవరావే ఆ కారులో లేకుండా ఉంటే అంతా గప్ చిప్ గా జరిగిపోయేది. కానీ, కాలం బాగా లేదు. అందుకే పోలిగాడి తల్లిదండ్రులని కలుసుకోక తప్ప లేదు.

పసుపు రాచిన పలకా, బలపం కొపీలే కాక, రాత్రంతా కొడుకు కలవరించిన చాకొలెట్లు రెండూ పట్టుకుని ఇంటికి వచ్చిన వీరన్న, జరిగింది విని నిలువునా కూలిపోయాడు. రంగి గోలగోలు మంటూంది. ఇరుగూ పొరుగూ వ్యవహారం ఫైసలు చేస్తూ బేరాలు ఆడుతూన్నారు.

"రెండొందలు ఇవిగో... పోయినో డెలాగూ రాడు గందా?" నోట్లకట్ట అందించాడు మధ్యవర్తి.

"ఎందుకిది? ఎందుకూఅంట..." దుఃఖం మింగుకుని కోపంతో బుసలుకొడుతూ అన్నాడు వీరన్న....

"జరిగిపోయింది మరిచిపో. ఏం చేసినా పోయినోడు రాడు. పోలీసులూ గొడవా ఎందుకూ మాఫీ చేసుకోటానికి ? పోనీ, మరో వంద తీసుకో." మధ్యవర్తి మాట వింటూనే వెంకట్రావు మరో పది పదిరూపాయల కాయి తాలు మధ్యవర్తి గుప్పెట్లో కుక్కాడు.

వీరన్న కళ్ళు రక్తం చిమ్మేట్లున్నాయి.

"ఇదిగో, ఓ బాగ్యవంతుడా! నీ కళ్ళు పసర్లు దట్టి నీ కుక్క బతుకోసం నా బిడ్డ పాణం బలెట్టావు. నేను నిన్నూ నీ కూతుర్నీ ఒక్కేటుకి చంపగలను. కానీ, నా బిడ్డ రాడే... అట్టా ఒచ్చేట్టుంటే నిన్నేగాదు, వంద మందిని నరికి పోగు లెట్టగలను. ఏం లాబం ? నా పోలిగాడు నాకు రాడు. పోయినోడు పోగా, నీ పాపం డబ్బు నా కెందుకు?

వద్దు. ఇది తీసుకెళ్ళి ఇంకా భాగ్యవంతుడివై ఇంకా నాలుగు కార్లు కొనుక్కో. ఇంకో పది కుక్కలని పెంచు. నా బిడ్డల్లాంటోళ్ళని ఇంకా పది మందిని చంపుతూ 'పాపీ చిరాయువు' అన్నట్లుండు. పో. నా కళ్ళముందు నించి పో... అయినా, ఇంత పేదింటో పుట్టి గంజినీళ్ళతో తురుతిబడికి ఆశగా నీ కూతురు తినే చాకొలెట్లు కావాలనుకోవటం నా బిడ్డది తప్పు. మా బతుకు లెంత, మే మెంత! మా పేదోళ్ళ బతుకుల కంటే నీ ఇల్లు కాపలా కాసే కుక్క బతుకు నయం. బాబూ, ఎల్లండి. నా బిడ్డని చంపి నీ విచ్చిన ఈ డబ్బుతో నే నాకలి తీరుచుకోనా? ఛూత్. అంత కంటే ఉపాసాలతో సస్తా గానీ, ఆ పాపం డబ్బు నా కొద్దు, బాబూ, వద్దు...."

వీరన్న మాటలు ఆ బస్తీలో వాళ్ళ కెవరికీ నచ్చలేదు. 'సందు దొరికింది. రొండొందల లేంటి రెండేలనా కక్కించచ్చు. కానీ, ఈ వీరన్న దేం ఇనటం లేదే. అయినా, మా కెందుకు' అనుకుంటూ ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయారు.

గుడిసెలోని గుడ్డి దీపం గప్పుమని ఆరిపోయింది.

పచ్చమేడమీద బెడ్‌రూమ్ నీలం బల్బు వెలుతురులో దోమతెర మంచం మీద డన్‌లప్ పరుపూ, మెత్తని దిండ్లూ పైన పడుకున్న నిమ్మీ జ్వర తీవ్రతతో ఉలిక్కి పడి "పోలిగా.... చాక్లెట్లూ" అంటూ కలవరిస్తూంది.

"ఓ కల్యాణ చక్రవర్తీ! నిలువుదోపిడీ ఇస్తాను. నీ కొండ కొస్తాను. నా తల్లిని చల్లగా చూడు" అని మనఃస్ఫూర్తిగా దణ్ణం పెడుతూ వెంకటేశ్వరుడికి లంచం ఎర జూపుతూంది ఆ భాగ్యవంతురాలు, నిమ్మీ తల్లి.

వెంకట్రావుకి వీరన్న అన్నమాటలు ఈటెల్లా తగిలి బాధ కలిగిస్తూన్నాయి. ఇటూ అటూ పచార్లు చేస్తూ ఆలోచిస్తూన్నాడు.

పదేళ్ళ క్రితం తన తమ్ముడు కారు ప్రమాదంలో మరణిస్తే- కారు యజమాని తప్పులేకున్నా, బెదిరించి కోర్టూ, పోలీసులూ అంటూ గుర్తుచేసి అయిదువేలు గుంజి ఆ డబ్బుతో వ్యాపారం మొదలెట్టి, అలా అలా లాభాలు తీస్తూ ఈ రోజుకి రెండు లక్షలకి అధిపతి అయ్యాడు. అయినా, ధన దాహం తగ్గలేదు. మనశ్శాంతి లేదు.

కూటికి లేకున్నా వీరన్న తనిచ్చే డబ్బు ఎందుకు తిరస్కరించాడు? అనేది వెంకట్రావుకి అర్థం కాని ప్రశ్న.

కథా నిలయం
5221
శ్రీకాకుళం

—o—